జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కీసర: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నాగారం మున్సిపల్ పరిధిలో స్టార్ ఫంక్షన్‌హాల్‌లో నేడు నిర్వహించే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు నిర్వహించే జాబ్‌మేళాల్లో పదోతరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 22 ఏళ్లున్న మహిళలు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. కొంగర కలాన్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో సుమారు 3 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తిగల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, మూడు పాస్‌ఫోటోలు జతచేసి దరఖాస్తు ఫామ్‌తో జతచేసి జాబ్‌మేళాలో అందజేయాలని సూచించారు.

పరీక్షల వేళలు మార్చడం సరికాదు

మేడ్చల్‌రూరల్: రంజాన్‌మాసం పేరు చెప్పి పదోతరగతి విద్యార్థుల ప్రీ ఫైనల్ పరీక్షల సమయాన్ని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేయడం సరికాదని బీజేవైఎం రాష్ట్ర నాయకులు రాగం అర్జున్ అన్నారు. మండుటెండలో మధ్యాహ్నం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించొద్దని, ఉదయం వేళల్లో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రంజాన్‌మాసం విద్యార్థుల పరీక్షలకు సంబంధం ఏంటని ప్రశ్నించారు.

పండుగ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కీసర: రంజాన్ పండుగను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఈ మేరకు కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలతో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఎస్సైలు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా పాసుబుక్‌లు రద్దుచేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

మేడ్చల్ : మండలంలోని గౌడవెల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిలో తప్పుడు నివేదికలతో కబ్జాదారులకు జారీచేసిన పట్టాదారు పాసుపుస్తకాలు రద్దుచేసి, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని స్థానికుడు నరేందర్‌రెడ్డి సోమవారం మేడ్చల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 352,365/1,2లో 25 గుంటల స్థలాన్ని రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదికలతో అక్రమ కబ్జాదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీచేశారని ఆరోపించారు. సదరు పట్టాలను రద్దుచేసి బోగస్ సెల్ సర్టిఫికేట్, ఇతర పత్రాలు తయారు చేసుకున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి

జవహర్‌నగర్: అనారోగ్యంతో కార్మికుడు మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడలోని ఓ గుడిసెలో చిన్నారావు (45)నివసిస్తూ దమ్మాయిగూడలోని లేబర్ అడ్డాలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కాగా అతడు మద్యానికి బానిసై గత 4 రోజులుగా బయటకు వెళ్లకుండా అనారోగ్యంతో బాధపడుతూ గుడిసెలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో స్థానికులు గమనించగా.. అప్పటికే అతడు మృతి చెంది చీమలు పట్టినట్టు కనిపించాడు. దీంతో వారు జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛత లోపం..!

- మున్సిపాలిటీల్లో రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు అంతంతే
- 13 పురపాలికల్లో అవుట్ సోర్సింగ్ కింద 1746 మంది
- ఏళ్లుగా భర్తీ కానీ ఖాళీలు, మరోవైపు విలీన జీపీలు
- పనిచేస్తున్న కార్మికులపైనే అదనపు భారం
- జనాభా ప్రతిపాదికన భర్తీ చేయాలంటున్న పుర ప్రజలు



సాక్షి,సిటీబ్యూరో: పారిశుద్ధ్య కార్మికుల కొరతతో శివారు పట్టణాల్లో స్వచ్ఛత లోపిస్తోంది. ఇటీవల మరో 28 గ్రామ పంచాయతీలు సమీపంలోని ఏడు పట్టణాల్లో విలీనం కావడంతో సమస్య మరింత జఠిలమైంది. ఏళ్లుగా భర్తీ కానీ పోస్టులతో పురపాలికల్లో శాశ్వత పారిశుద్ధ్య కార్మికుల కొరత అధికంగా కనిపిస్తోంది. డ్రైనేజీలు శుభ్రం చేసే కామాటీలు, రహదారులు, వీధులు శుభ్రం చేసే స్వీపర్లు సరిపడా లేకపోవడంతో పట్టణాల్లో స్వచ్ఛత గాడి తప్పుతోంది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలికల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ఏళ్లుగా పారిశుద్ధ్య విభాగాల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకపోవడంతో ఉన్న కార్మికులపైనే అదనపు భారం పడుతోంది.

నిబంధనలకు తూట్లు..

పురపాలక శాఖ పరిపాలనా విభాగం నిబంధనల ప్రకారం ప్రతి 10 వేల జనాభాకు 28 మంది రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉన్నప్పటికీ అమలు కావడం లేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట నగరపాలక సంస్థలు, కొంపెల్లి, దుండిగల్, మేడ్చల్, నాగారం, తూంకుంట, గుండ్లపోంచపల్లి, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,24,239 జనాభా ఉండగా, ప్రస్తుతం సుమారు 10 లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీనికితోడూ ఇటీవల ఘట్‌కేసర్, తూంకుంట, పోచారం, దమ్మాయిగూడ, నాగారం తదితర ఏడు పురపాలక సంఘాల పరిధిలోకి 28 పంచాయతీలు విలీనమయ్యాయి. ఈ మున్సిపాలిట్లీ 1746 మంది పారిశుద్ధ్య కార్మికులు అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, కాలనీలకు అనుగుణంగా పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న వారిపైనే అధిక భారం పడుతోంది.

గణనీయంగా పెరిగిన జనాభా..

నగర శివారు 13 పురపాలికల్లో గణనీయంగా జనాభా పెరుగతుండడంతో సుమారు 10 లక్షల జనాభా దాటింది. ఈ లెక్క ప్రకారం శివారు పురపాలక సంఘాల్లో 2,840 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంటోంది. 13 పురపాలక సంఘాల్లో ప్రస్తుతం రెగ్యులర్ పారిశద్ధ్య కార్మికులు లేకపోవడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అవుట్ సోర్సింగ్ సేవల కింద నియమించిన కార్మికులతోనే పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు.

ప్యానల్ పోస్టులకే ప్రాధాన్యం..

పురపాలికల్లో కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మేనేజర్లు, ఆకౌంటెంట్లు, ఆర్ఐలు, క్లర్కులు, బిల్ కలెక్టర్లు వంటి ప్యానల్ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్న ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల విషయాన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. గతంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా జిల్లాలోని పురపాలికల్లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో ప్యానల్ పోస్టులు భర్తీ అయ్యాయి.అయితే పారిశుద్ధ్య కార్మికుల పోస్టులు మాత్రం ఖాళీగానే ఉంటున్నాయి.

పురపాలక సంఘాల వారీగా ఇలా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో అవుట్ సోర్సింగ్ కింద 1746 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తుండగా, ఇందులో పురపాలికల వారీగా సంఖ్య ఇలా ఉంది. పీర్జాదిగూడలో 56 మంది పారిశుద్ధ్య కార్మికులు, నిజాంపేటలో 248, నాగారంలో 145, మేడ్చల్‌లో 139, కొంపెల్లిలో 188, జవహర్‌నగర్‌లో 90 మంది పని చేస్తున్నారు. అలాగే బోడుప్పల్‌లో 182, దుండిగల్‌లో 150, ఘట్‌కేసర్‌లో 86, గుండ్లపోచంపల్లిలో 120, దమ్మాయిగూడలో 157, పోచారంలో 111, తూంకుంటలో 74 మంది పారిశుద్ధ్య కార్మికులు అవుట్ సోర్సింగ్ కింద సేవలందిస్తున్నారు. ఇటీవల విలీనమైన 28 గ్రామ పంచాయతీల కార్మికుల సేవలను ఆయా మున్సిపాలిటీలు వినియోగించుకుంటుండడంతో వారిని కూడా తమ కార్మికులుగా గుర్తించాలని కోరుతున్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



అవార్డు అందజేస్తున్న మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ప్రస్తుత యుగంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, శాస్త్ర సాంకేతిక రంగంలో సైతం రాణించాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యూచర్ శాస్త్ర - 2కే25 పేరిట జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థినులు సాంకేతికతను అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం డీబీఎస్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శాంతమోన భరద్వాజ్ మాట్లాడుతూ.. భవిష్యత్తును రూపొందించడంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల పాత్ర ముఖ్యమైందన్నారు. టెక్ పరిశ్రమలో మహిళల సాధికారత ప్రాముఖ్యతను వివరించి యువ ఇంజినీర్లు ధైర్యంగా, నమ్మకంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు తమ ప్రతిభను వెలికితీసి ప్రదర్శించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు ప్రిన్సిపాల్ మాధవీలత నగదు బహుమతులు ప్రదానం చేశారు.

దివ్యాంగులను నామినేట్ చేయాలి



సంతకాలు సేకరిస్తున్న దివ్యాంగుల హక్కుల సభ్యులు

ఘట్‌కేసర్: గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో దివ్యాంగులను నామినేట్ చేయాలని కోరుతూ దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లో సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 12 శాతం దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లో ప్రత్యేక చట్టాల ద్వారా దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరిని నామినేట్ చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ పంచాయత్ రాజ్ చట్టం-2018, మున్సిపాలిటీ చట్టం-2019లో సవరణలు చేపట్టి దివ్యాంగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చి 1 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న సంతకాల సేకరణ ఉద్యమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నాయకురాలు సబిత, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల అధ్యక్షులు నీరజారెడ్డి, నాగయ్య, జ్ఞానేశ్వర్, మాణిక్యం, లక్ష్మయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

కనులపండువగా మల్లన్న జాతర



శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి మండల కేంద్రం శామీర్‌పేటలలోని మల్లికార్జున స్వామి జాతరలో పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. యాదవ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జవహర్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారంతో పాటు మార్చి10న నిర్వహించే మిలియన్‌మార్చ్‌ను జయప్రదం చేయాలని టీయూజేఏసీ, ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం జవహర్‌నగర్ ప్రధాన చౌరస్తాలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీయూజేఏసీ సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తూటాలకు ఎదుర్కొని పోరాటాలు చేశామని, తమకు దక్కాల్సిన ఫలాలు దక్కకుంటే మిలియన్ మార్చ్‌తో మరోచరిత్ర సృష్టిస్తామన్నారు. ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు షేక్‌షావలీ, పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు సునీత, ప్రజా సంఘాల నాయకులు వేణు, సింగరాయగౌడ్, శివబాబు, యాకస్వామి, చంద్రన్న, యాదగిరి, రాజు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనమహోత్సవం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ జనహిత జానకి జీవన్ మానసిక దివ్యాంగుల పాఠశాల, అన్నపూర్ణ భారతిసేవ వంటశాల ఆవరణలో స్థల దాతల కోరిక మేరకు సోమవారం సిద్ధి వినాయక, బాలసుబ్రహ్మణ్య, దక్షిణామూర్తి, లక్ష్మణహనుమత్ సమేత సీతారాంచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి కీసరపల్లి భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి స్వామి, వారణాసిలోని కాశీ పీఠాధిపతి శివనాగేంద్ర సరస్వతిస్వామిజీ, కీసరలోని శ్రీసాయిధామం పీఠాధిపతి శ్రీరామచంద్ర ప్రభూజీ చేతుల మీదుగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రాణప్రతిష్ఠ చేశారు. జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



ఎంపీ ఈటల రాజేందర్‌కు డైరీలను అందజేస్తున్న టీయూడబ్ల్యూజే సభ్యులు

శామీర్‌పేట్: జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ టీయూడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను జిల్లా కమిటీ సభ్యులతో కలిసి టీయూడబ్ల్యూజే రాష్ట్ర , మేడ్చల్ జిల్లా డైరీని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ... ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. మేడ్చల్ జిల్లాలోని జర్నలిస్టులందరితో తాను త్వరలోనే ప్రత్యేకంగా సమావేశం అవుతానని, అందుకు తగిన ఏర్పాటు చేయాల్సిందిగా మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డికి చెప్పానన్నారు. రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్‌రెడ్డి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు మల్కయ్య, హరినాథ్, జిల్లా కమిటీ సభ్యులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, విజయ్, ఏవీ శ్రీధర్‌రావు, గంగరాజు, భూపాల్, క్యాతం రవి, మహేందర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వంద అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్

తక్షణ పరిష్కారానికి ఆదేశం



సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు సంబంధించిన 100 అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి ఆయన ప్రజా వినతులను తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలు,బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ పథకాల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. అక్రమ భవన నిర్మాణాలు, భూకబ్జాలు, ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లు తదితర వాటిపై కూడా ప్రజావాణిలో సంబంధిత అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి..

సాక్షి,సిటీబ్యూరో: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా టీజీవోస్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈనెల 5న మేడ్చల్ కలెక్టరేట్‌లో మహిళా అధికారులు, ఉద్యోగులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్న టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ తెలిపారు.రాష్ట్రస్థాయిలో 6,7,తేదీల్లో హైదరాబాద్‌లో పెద్దఎత్తున మహిళా దినోత్సవ ఉత్సవాలను ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు హరిప్రియ,చంద్రావతి, జ్యోతి, ఝాన్సీరాణి, చంద్రావతి, సుగుణబాయి, స్వర్ణలత, నాగాంజలి, డీఆర్డీఏ సాంబశివరావు, సీపీఓ శేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం




స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం మెరుగుపడుతుందని మేడ్చల్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహ్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఉత్కృష్ట పేరిట స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తిని పెంచితే చదువులో ఏకాగ్రత పెరుగుతుందని, రోగనిరోధకశక్తి కూడా మెరుగవుతుందన్నారు. జేఎన్‌టీయూహెచ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి ఎస్ఎస్ దిలీప్, కళాశాల చైర్మన్ నర్సింహ్మారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డైరెక్టర్ మోహన్, పీడీ వంశీకృష్ణ, కన్వీనర్ పురుషోత్తం ప్రసాద్, శైలజారెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మేడ్చల్‌రూరల్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన సోమవారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ పట్టణ పరిధి, అత్వెల్లిలోని నేషనల్ మార్ట్ సమీపంలో ఓ మృతదేహం పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలపై ఆరా తీయగా లభించలేదు. దీంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రెవెన్యూ పరిధి ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా నిర్మించిన పలు కట్టడాలను రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేయించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు సర్వేనంబర్ 117లోని సీలింగ్ భూమిలో నిర్మించిన 4 గదులు, ఒక షెడ్డును కూల్చివేసినట్లు ఆర్ఐ సాయిరాం తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైన ఉపేక్షించే లేదని ఆర్ఐ స్పష్టం చేశారు.

ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

దమ్మాయిగూడ మున్సిపాల్ కమిషనర్ నాగమణి



సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి



మాట్లాడుతున్న కమిషనర్ వీరారెడ్డి

కీసర: అనధికార లేఔట్‌లో ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి అన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అధికారులు 2020లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఈనెల 31 వరకు క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఫీజు చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. సెలవుదినాల్లోనూ ఈ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. దరఖాస్తుదారుడికి సందేహాలు ఉంటే ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై సమీక్ష సమావేశం..

పోచారం: పోచారం మున్సిపల్ ఆఫీస్‌లో ఎల్ఆర్ఎస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు విలీన గ్రామాలతో కలిపి మొత్తం 17,010 దరఖాస్తులు వచ్చాయని, 25శాతం రాయితీతో మార్చి 30వ తేదీలోగా అర్హులైన దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. మేనేజర్ నిర్మల, ఆర్ఓ సాయికిరణ్‌రాజ్, వార్డు ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

మేడ్చల్ : మున్సిపల్ ప్రజలు ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందన్నారు. 2020లో రూ. 100 చెల్లించి రిజిస్టర్ చేసుకున్న యజమానులు మార్చి 31లోగా పూర్తి ఫీజు చెల్లించడం ద్వారా 25 శాతం రాయితీ పొందవచ్చని సూచించారు. ఫీజు చెల్లింపుల కోసం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని, సెలవురోజుల్లో సైతం సేవలు అందించనున్నట్లు వివరించారు.

ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక సమావేశం..

శామీర్‌పేట్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వెంటనే పూర్తిచేయాలని తుంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో చెల్లించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలన్నారు. ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ఈనెల 31లోగా చెల్లించే వారికి మొత్తం ఎల్ఆర్ఎస్ రుసుములో 25% శాతం తగ్గించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

- భర్తే కడతేర్చాడని మృతురాలి బంధువుల ఆరోపణ
- కుమార్తెతో పాటు భర్తపై దాడి, ఆపై పోలీసులకు ఫిర్యాదు



అనురాధా (ఫైల్)

ఘట్‌కేసర్: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏదులాబాద్‌కు చెందిన అనురాధా (52), మలక్‌పేట్‌కు చెందిన శ్రీనివాస్‌తో 1996లో వివాహమైంది. రెండేళ్ల క్రితం ఏదులాబాద్‌లోనే ఇల్లు నిర్మించుకుని ఇక్కడే నివాసం ఉంటున్నారు. కాగా భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఫిబ్రవరి 28న రాత్రి అనురాధా అనారోగ్యం పాలు కావడంతో భర్త శ్రీనివాస్, కుమార్తె మానసతో పాటు ఆటోలో ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బీపీ, షుగర్ అదుపు తప్పిందని, వెంటనే పెద్దాసుపత్రిలో వైద్యం అందించాలని చెప్పడంతో వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆమె చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందింది.

భర్త దాడి చేయడంతోనే..

భర్త దాడి కారణంగానే తమ సోదరి మృతి చెందిందని మృతురాలి సోదరుడు కాలేరు నర్సింగ్‌రావు ఆరోపించారు. సోదరుడితో పాటు బంధువులు భర్త శ్రీనివాస్, కుమార్తె మానసపై దాడి చేశారు. దీంతో వారు సమీపంలోని ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతురాలి బంధువులు మృతదేహాన్ని ఏదులాబాద్‌కు తీసుకురాగా.. ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా ఉండటం, గోడలపై రక్తం మరకలు, తలకు గాయాలు ఉన్నాయని చెబుతున్నారు.

చిట్టీలు వేసి, క్యాటరింగ్ చేస్తూ..

తమ సోదరి కష్టపడి చిట్టీలు వేసి, క్యాటరింగ్ పనులు చేస్తూ ఇంటిని నిర్మించి కుటుంబం నడిపిస్తుంటే భర్త మద్యానికి బానిసై ఆమెను అనుమానించి, దాడిచేసేవాడని బంధువులు ఆరోపించారు. కుమార్తె, భర్త కలిసి ఆమె తలను గోడకుకొట్టారని, ఆమె తమకు చెప్పేదని, మృతురాలి బంధువులు అంటున్నారు. కాగా బంధువుల మధ్య ఆస్తిగొడవలు నడుస్తున్నట్లు సమాచారం. భర్త దాడిచేయడంతోనే తన సోదరి మృతిచెందిందని, మృతురాలి సోదరుడు ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.